


APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

22-06-2026
**సోమవారం**
**హైదరాబాద్**
సంపుటి: 17 । సంచిక: 238
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



యోగా అనేది ప్రపంచ ఉద్యమమని, అది దేశాల.. సాంస్కృతిక సరిహద్దులను అధిగమిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కేవలం ఒక్క రోజుకో, ఒక్క కార్యక్రమానికో పరిమితం చేయకుండా యోగాభ్యాసాన్ని దైనందిన జీవనంలో భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. జూన్ 21 అంటే సుదీర్ఘ పగలు ఉండే రోజుగానే కాకుండా అతి పెద్ద సామాజిక వేడుక దినంగా మారిందని, దానికి యోగా కారణమని పేర్కొన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కోల్‌కతాలోని రెడ్‌రోడ్‌లో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

## కోల్‌కతా యోగా వేడుకల్లో
# ప్రధాని మోదీ


### వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా శాంతికి మంత్రం

### అభ్యాసం ఒక రోజుకు పరిమితం కాకూడదు

### అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని ఉద్ఘాటన

**కోల్‌కతా, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** యోగా అనేది ప్రపంచ ఉద్యమమని, అది దేశాల.. సాంస్కృతిక సరిహద్దులను అధిగమిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కేవలం ఒక్క రోజుకో, ఒక్క కార్యక్రమానికో పరిమితం చేయకుండా యోగాభ్యాసాన్ని దైనందిన జీవనంలో భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. జూన్ 21 అంటే సుదీర్ఘ పగలు ఉండే రోజుగానే కాకుండా అతి పెద్ద సామాజిక వేడుక దినంగా మారిందని, దానికి యోగా కారణమని పేర్కొన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కోల్‌కతాలోని రెడ్‌రోడ్‌లో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కోల్‌కతాతోపాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో, విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాల ఆధ్వర్యంలో భారీగా వేడుకలు నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర మంత్రులు, ఆయా రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు,

మిగతా2లో...







## మూసీ పేరుతో
# రేవంత్ విధ్వంసం

### లక్షన్నర కోట్ల కమీషన్ల కోసం రేవంత్ రెడ్డి కుట్ర

- చోటే భాయ్ - బడే భాయ్ కుమ్మక్కు
- ఫ్యూచర్ సిటీ కాదు.. రియల్ ఎస్టేట్ సిటీ
- కాంగ్రెస్ ప్రభుత్వం కాదు.. ఇది దండుపాళ్యం ముఠా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు
- రాజేంద్రనగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:**
మూసీ సుందరీకరణ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న విధ్వంసంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీ మహాత్ముడి పేరుతో రేవంత్ రెడ్డి చేస్తున్న ఈ అరాచకాలను చూస్తే ఆ గాంధీ ఆత్మ కూడా ఘోషిస్తుందని ఆయన మండిపడ్డారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, రేవంత్ రెడ్డి పాలనను దండుపాళ్యం ముఠాతో పోల్చారు. "రేవంత్ రెడ్డి నమ్మేది గాడ్సేను.. కానీ మహాత్మా గాంధీ విగ్రహం

మిగతా2లో...

## ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు

- 37 మంది ప్రయాణికులకు త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఘటన
- ఎల్ఎండీ సమీపంలో పూర్తిగా దగ్ధమైన ఈ-బస్సు

2

కాంగ్రెస్ గ్యారంటీలపై
## రాహుల్‌ను కలవాలి

- సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ బహిరంగ లేఖ
- హామీల అమలులో ప్రభుత్వం ఘోర వైఫల్యం
- నెరవేరని హామీలతో ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు
- రాహుల్ గాంధీతో అపాయింట్‌మెంట్ కల్పించాలని సీఎంకు వినతి

2

## ప్రశాంతంగా ముగిసిన
# నీట్ రీఎగ్జామ్

- దేశవ్యాప్తంగా పకడ్బందీగా నిర్వహణ
- అత్యంత కఠిన నిబంధనలు అమలు
- ఫిజిక్స్‌లో లెక్కలతో సతమతమైన అభ్యర్థులు
- త్వరలోనే ఫలితాలు విడుదల
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్ రీఎగ్జామ్ ఆదివారం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా విజయవంతంగా ముగిసింది. మే 3న జరిగిన పరీక్షలో వెల్లువెత్తిన అక్రమాలు, లీకేజీ ఆరోపణల నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ

మిగతా2లో...

విలేకరులు కావలెను

స్నేహిత
ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com



Contacts
తెలంగాణ
95500 21491

ఆంధ్రప్రదేశ్,
తెలంగాణ రాష్ట్రాల్లో
ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

# కోల్‌కతా యోగా వేడుకల్లో ప్రధాని మోదీ

**(మొదటి పేజీ తరువాయి)**

వివిధ వర్గాలవారు, దౌత్యవేత్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోల్‌కతా కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ వ్యక్తిగత ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికే కాకుండా ప్రపంచ శాంతికి ఉత్ప్రేరకంగా యోగా నిలుస్తుందని చెప్పారు. 'ప్రాచీన భారతీయ అభ్యాసమైన యోగావల్ల శారీరక ఆరోగ్యానికి మించిన ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. పనిని, పోషకాహారాన్ని, నిద్రను మనం సమతుల్యం చేసుకోవాలి. ఆధునిక జీవనశైలిలో దీనికి కొంత అవాంతరం వాటిల్లుతుంటుంది. ఏం చేయాలి.. ఏం చేయకూడదు.. జీవితాన్ని ఎలా సంతులనం చేసుకోవాలనేది యోగా మనకు చెబుతుంది. మన శరీరాన్ని ఎలా మలచుకోవాలో తెలిస్తే ఆరోగ్యం ఒక అలవాటుగా మారిపోతుంది. శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఆత్మ చైతన్యాలకు యోగా ఉపయోగపడుతుంది. ఏం చేయకూడదనే చైతన్యం మనలో వచ్చినప్పుడు ప్రపంచ శాంతికీ అది దారులు తెరుస్తుంది. అందుకే మన జీవన విధానానికే కాకుండా ప్రపంచ భవితవ్యం మెరుగయ్యేందుకూ ఇది అవసరం. అందుకే జీవితకాలమంతా దీనిని మనం, మన కుటుంబాలు, భవిష్యతరాలు అభ్యసించాలి. ప్రజల్ని దగ్గర చేయడానికి యోగా దారి చూపిస్తుంది. శారీరకంగానే కాకుండా అన్నివిధాలా, అన్ని వయసుల వారికీ ఇది ప్రయోజనం కలిగిస్తుంది. మానవాళి ఐక్యతను ప్రోది చేస్తుంది' అని ప్రధాని చెప్పారు. తెల్లని దుస్తుల్లో కార్యక్రమానికి హాజరైన మోదీ.. వేలమంది ప్రజలతో కలిసి యోగాసనాలు వేశారు. 40 నిమిషాలపాటు కొనసాగిన కార్యక్రమంలో ఆయన ప్రజల మధ్యకు వెళ్లి వారు యోగాభ్యాసం చేస్తున్న తీరును స్వయంగా గమనించారు. కొందరు సరైన భంగిమలో ఆసనాలు చేసేలా ఆయన సహకారం అందించారు.

**తాజ్‌మహల్ నుంచి బీదర్ కోట వరకూ..**

యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాత తాజ్‌మహల్ నుంచి బీదర్ కోట వరకూ దేశంలోని అనేక ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. 'భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ' (ఏఎస్ఐ) అధీనంలో ఉన్న అనేక ప్రాంతాలు వీటికి వేదికలయ్యాయి. 'వయసుతోపాటు ఆరోగ్యానికి యోగా' అనే ఇతివృత్తంతో ఈసారి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యప్రదేశ్‌లోని జబల్పుర్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, లద్దాఖ్‌లో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, షిల్లాంగ్‌లో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆసనాలు వేశారు. సుప్రీం కోర్టు ప్రాంగణంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ యోగాసనాలు వేశారు. దృష్టి కేంద్రీకరించి కొద్దిసేపు ధ్యానం చేసినా, చిన్నపాటి వ్యాయామాలు చేసినా ఎంతో ఫలితం ఉంటుందని ఆయన చెప్పారు.


**టోక్యో.. న్యూయార్క్..**

జపాన్ మొదలుకుని ప్రపంచంలో అనేక దేశాల్లో యోగా వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి. టోక్యోలో వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా యోగాసనాలు వేశారు. న్యూయార్క్‌లోని చరిత్రాత్మక టైమ్‌స్క్వేర్‌వద్ద వేర్వేరు దేశాలకు చెందిన ఔత్సాహికులు చేరి యోగా చేశారు. రష్యా, చైనా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిన్లాండ్, మలేసియా, సౌదీ అరేబియా, కెనడా, ఒమన్, డెన్మార్క్, బంగ్లాదేశ్, నేపాల్ తదితర దేశాలన్నీ ఈసారి వేడుకల్లో పాల్గొన్నాయి. భారత దౌత్యవేత్తలు, రాయబార కార్యాలయాల సిబ్బందితోపాటు అనేకమంది ఔత్సాహికులు వీటిలో పాలుపంచుకున్నారు.

**కృతజ్ఞతలు తెలిపిన మోదీ**

అసలైన ప్రపంచ వేడుకగా యోగా దినోత్సవాన్ని పాటించినందుకు 'ఎక్స్' వేదికగా ప్రజలకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. మరింతమంది రోజువారీ జీవితాల్లో యోగా భాగమయ్యేందుకు ఇది ప్రేరణనిస్తుందన్నారు.








# కాంగ్రెస్ గ్యారంటీలపై రాహుల్‌ను కలవాలి

- సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ బహిరంగ లేఖ
- హామీల అమలులో ప్రభుత్వం ఘోర వైఫల్యం
- నెరవేరని హామీలతో ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు
- రాహుల్ గాంధీతో అపాయింట్‌మెంట్ కల్పించాలని సీఎంకు వినతి
- స్పందించకుంటే అది ప్రజలకు చేసిన ద్రోహమేనని హెచ్చరిక



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర ఎన్నికల హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తీరుపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి వినతి పత్రం సమర్పించేందుకు ఆయనతో అపాయింట్‌మెంట్ ఇప్పించాలని సీఎంను కోరారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ స్వయంగా ఇచ్చిన గ్యారంటీలపై ప్రజలు నమ్మకంతో కాంగ్రెస్‌కు ఓటేశారని రాంచందర్ రావు లేఖలో పేర్కొన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ హామీలన్నీ గాలికి వదిలేశారని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, రైతులకు ఎకరాకు రూ.15,000 రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నిరుద్యోగ భృతి (రూ.4,000), వృద్ధులకు రూ.4,000 పెన్షన్ వంటి కీలక హామీలు ఇంకా కార్యరూపం దాల్చలేదని గుర్తు చేశారు.

**విద్యార్థులు, యువత ఆశలపై నీళ్లు**

విద్యార్థులు, యువతను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిరాశకు గురిచేసిందని రాంచందర్ రావు లేఖలో నొక్కి చెప్పారు. విద్యా భరోసా కింద రూ.5 లక్షల సహాయం, ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, అమ్మాయిలకు ఉచిత స్కూటర్ల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం, భృతి కోసం ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నారని, కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రజల సమస్యలను, వారి ఆందోళనలను నేరుగా రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, అందుకోసం వీలైనంత త్వరగా ఆయన అపాయింట్‌మెంట్ ఇప్పించాలని సీఎంను కోరారు. ఒకవేళ కాంగ్రెస్ నాయకత్వం స్పందించడంలో విఫలమైతే, అది తెలంగాణ ప్రజలకు వారు చేసిన తీవ్ర ద్రోహమేనని రాంచందర్ రావు స్పష్టం చేశారు. తమ హామీలను తామే అమలు చేయలేక, ప్రజల గొంతును కూడా వినడానికి సిద్ధంగా లేరని అర్థమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు.

# ప్రశాంతంగా ముగిసిన నీట్ రీ-ఎగ్జామ్

**(మొదటిపేజీ తరువాయి)**

ఈ రీఎగ్జామ్‌ను అత్యంత కఠినమైన నిబంధనలతో నిర్వహించింది. దేశవ్యాప్తంగా 551 నగరాల్లోని 5,440 కేంద్రాల్లో సుమారు 22.79 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఈసారి పరీక్షను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేసింది. పరీక్షా కేంద్రాల వద్ద బయోమెట్రిక్ వెరిఫికేషన్, సీసీటీవీ నిఘా, మొబైల్ సిగ్నల్ జామర్లను ఏర్పాటు చేశారు. ప్రతి అభ్యర్థిని రెండు దఫాలు తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వయంగా పరీక్షా నిర్వహణను పర్యవేక్షించారు. సుమారు ఏడు లక్షల మంది అధికారులు, సిబ్బంది ఈ పరీక్షా నిర్వహణలో పాలుపంచుకున్నారు.

**విద్యార్థులను కష్టపెట్టిన ప్రశ్నపత్రం**

పరీక్షా కేంద్రాల నుండి బయటకు వచ్చిన విద్యార్థుల ముఖాల్లో ఒకింత అలసట, మరికొంత ఆందోళన కనిపించాయి. ప్రాథమిక విశ్లేషణ ప్రకారం మే 3న జరిగిన పరీక్ష కంటే ఈసారి పేపర్ స్థాయి కొంచెం కష్టంగా ఉందని మెజారిటీ విద్యార్థులు పేర్కొన్నారు. ఫిజిక్స్ అత్యంత కష్టంగా, సమయం తీసుకునేలా ఉందని, ఎక్కువ శాతం లెక్కలు ఉండటంతో సమయం సరిపోలేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కెమిస్ట్రీ మోడరేట్‌గా ఉండగా, బయాలజీ ఎప్పటిలాగే ఎన్సీఈఆర్టీ ఆధారిత ప్రశ్నలతో సులభంగా, స్కోరింగ్ ఇచ్చే విధంగా ఉందని మెజారిటీ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. పరీక్షా సరళిని గమనిస్తే కేవలం బట్టీ పట్టడం కంటే కాన్సెప్ట్‌లపై పట్టు ఉన్న విద్యార్థులకే ఈసారి మెరుగైన స్కోరు వచ్చే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అభ్యర్థుల ఓఎమ్ఆర్ షీట్లు ఇప్పటికే భద్రపరిచామని త్వరలోనే ప్రొవిజనల్ ఆన్సర్ కీని అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. పరీక్షను రికార్డు స్థాయిలో 37 రోజుల్లోనే తిరిగి నిర్వహించామని ఫలితాలను కూడా ఊహించిన దానికంటే వేగంగా విడుదల చేస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ స్పష్టం చేశారు. ఆశలన్నీ ఇప్పుడు ఫలితాల వైపు మళ్లాయి.




# ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు

- 37 మంది ప్రయాణికులకు త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఘటన
- ఎల్ఎండీ సమీపంలో పూర్తిగా దగ్ధమైన ఈ-బస్సు

**కరీంనగర్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న తెలంగాణ ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో ఆదివారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీ సమీపానికి చేరుకోగానే ఈ ప్రమాదం జరిగింది. బస్సు వెనుక భాగం నుంచి అకస్మాత్తుగా పొగలు రావడంతో పాటు పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని ముందే గుర్తించిన డ్రైవర్ అత్యంత చాకచక్యంగా వ్యవహరించి, బస్సును వెంటనే రోడ్డు పక్కన నిలిపివేశారు. బస్సులో ఉన్న 37 మంది ప్రయాణికులను తక్షణమే సురక్షితంగా కిందికి దింపడంతో ఒక పెద్ద ప్రమాదం తప్పింది. ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

**క్షణాల్లో వ్యాపించిన మంటలు.. బస్సు పూర్తిగా దగ్ధం**

ప్రయాణికులు కిందికి దిగిన కొద్ది క్షణాల్లోనే మంటలు బస్సు మొత్తం వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు శ్రమించారు. అయితే అప్పటికే మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో కరీంనగర్-2 డిపోకు చెందిన ఈ ఎలక్ట్రిక్ బస్సు పూర్తిగా అగ్నికి ఆహుతై రూపురేఖల్లేకుండా దగ్ధమైంది. ఈ అకస్మాత్తు ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. రద్దీగా ఉండే రాజీవ్ రహదారిపై ఎలక్ట్రిక్ బస్సులో మంటలు చెలరేగడానికి గల కారణాలపై ఆర్టీసీ అధికారులు లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. బస్సులో తలెత్తిన సాంకేతిక లోపమా లేక బ్యాటరీ సంబంధిత సమస్యల వల్ల ఈ ప్రమాదం జరిగిందా అనే కోణాల్లో విచారణ జరుపుతున్నారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడం వల్లే తమ ప్రాణాలు దక్కాయని ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.



# మూసీ పేరుతో రేవంత్ విధ్వంసం



**(మొదటిపేజీ తరువాయి)**

పెడతానని దొంగ మాటలు చెప్తున్నారు. గాంధీపై నిజంగా ప్రేమ ఉంటే పేదల ఇళ్లు కూల్చకుండా, ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించాలి" అని కేటీఆర్ సూచించారు. కమీషన్ల కోసం వేలమంది పేదల ఇళ్లు కూల్చేందుకు రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్రను మహాత్మా గాంధీ మనుమడు తుషార్ గాంధీ కూడా వ్యతిరేకించారని గుర్తు చేశారు. చిన్నపిల్లలు తమ కిట్టీ బ్యాంకులో ఉన్న డబ్బులిస్తాం, ఇళ్లు వదిలేయండని వేడుకున్నా.. రేవంత్ రెడ్డి మనసు కరగని దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని విమర్శించారు.

**చోటే భాయ్ - బడే భాయ్ కుమ్మక్కు**

మూసీ విధ్వంసానికి బీజేపీ కూడా మద్దతు ఇస్తోందని కేటీఆర్ ఆరోపించారు. "మోడీతో మాట్లాడుకుని, రేవంత్ రెడ్డి (చోటే భాయ్) నరేంద్ర మోడీ (బడే భాయ్) ఇద్దరూ కలిసి పేదల భూములను లాక్కుంటున్నారు. నిజాయితీ ఉంటే పేదలకు అన్యాయం చేయవద్దని మోడీ ఎందుకు ప్రశ్నించరు?" అని నిలదీశారు. స్థానికంగా ఈటల రాజేందర్, కిషన్ రెడ్డి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నా, సొంత ప్రభుత్వం మాత్రం ఇళ్లు కూలగొట్టమని అనుమతులు ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఒక్క హామీ నెరవేర్చేందుకు డబ్బులు లేవని చెప్పే రేవంత్ రెడ్డి, మూసీలో మాత్రం లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడానికి సిద్ధమవ్వడం వెనుక పెద్ద కుట్ర ఉందని కేటీఆర్ అన్నారు. "ప్రతి నెల ఢిల్లీకి సంచుల కట్టలు పంపకపోతే సీఎం పదవి పోతుందని రేవంత్ రెడ్డికి భయం. అందుకే కమీషన్ల కోసం అరాచకాలు చేస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. ఇది ప్రభుత్వం కాదని, అందినంత దోచుకో.. దొరికిన కాడికి దాచుకో అనే స్కీముతో నడుస్తున్న మాఫియా రాజ్యమని విమర్శించారు.

**ఫ్యూచర్ సిటీ కాదు.. రియల్ ఎస్టేట్ సిటీ**

హైదరాబాద్‌లో వేలాది ఇళ్లు కూల్చడానికి సిద్ధమవుతున్న ప్రభుత్వం, ఉన్న సిటీని వదిలేసి ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. "రేవంత్ రెడ్డి తన సొంత భూములను కాపాడుకోవడానికే ఉనికిలో లేని ఫ్యూచర్ సిటీకి తిరుగుతున్నారు" అని మండిపడ్డారు. శంషాబాద్‌లో 180 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశారని ఆరోపించారు. ఏ మంత్రిని చూసినా, చివరకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుమారుడిని చూసినా గుండాయిజం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే అభివృద్ధి పేరుతో పార్టీ మారినా, కార్యకర్తలు మాత్రం కేసీఆర్‌తోనే ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎంతమంది పెద్ద నేతలు పోయినా గులాబీ సైన్యం చెక్కుచెదరలేదని, రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సభ్యత్వ నమోదుతో పాటు ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

# గ్రామ అభివృద్ధికి ముందడుగు

- లింగంపల్లిని జిల్లాకే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- వార్డు సభ్యులతో కలిసి సమగ్ర అభివృద్ధికి కృషి
- సర్పంచ్ వడ్ల శోభ పరమేశ్వర్

**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం, లింగంపల్లి గ్రామం అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. గ్రామ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవనే పరమావధిగా భావిస్తూ నూతన పాలకవర్గం గ్రామాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోంది. గ్రామ సర్పంచ్ వడ్ల శోభ పరమేశ్వర్ నాయకత్వంలో గ్రామంలో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి సమస్యల పరిష్కారం, వీధి దీపాల ఏర్పాటు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు.అధికారంలోకి వచ్చిన నాటి నుంచే గ్రామ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ పాలకవర్గం పని చేస్తోంది. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడం గ్రామ ప్రజల్లో కొత్త ఆశలు నింపుతోంది. గ్రామంలోని వీధుల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, దోమల నివారణ కోసం గడ్డి మందు పిచికారీ చేయించడం, తాగునీటి సరఫరాను బలోపేతం చేయడం వంటి పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.అదేవిధంగా గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఇంటికి మౌలిక సదుపాయాలు అందించాలనే సంకల్పంతో నూతన పాలకవర్గం పని చేస్తోందని సర్పంచ్ వడ్ల శోభా పరమేశ్వర్ తెలిపారు. గ్రామంలో అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ వడ్ల శోభా పరమేశ్వర్ మాట్లాడుతూ.. లింగంపల్లి గ్రామాన్ని మండలంలోనే కాకుండా జిల్లాలో ఆదర్శ గ్రామంగా నిలబెట్టడమే మా లక్ష్యం..రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యల పరిష్కారమే మా ధ్యేయం. ప్రజల దీవెనలు, ప్రజల విశ్వాసమే మాకు బలం. గ్రామాభివృద్ధి కోసం ఎలాంటి రాజీ పడకుండా పనిచేస్తాం" అని అన్నారు. వార్డు సభ్యులు, పాలకవర్గ సభ్యులు కూడా గ్రామాభివృద్ధిలో భాగస్వాములవుతూ ప్రజలతో నిరంతరం మమేకమవుతున్నారు. ప్రజల సూచనలు, సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిపై వెంటనే స్పందించడం వల్ల గ్రామ ప్రజల నుంచి పాలకవర్గానికి విశేష ఆదరణ లభిస్తోంది. గ్రామాభివృద్ధి కోసం తీసుకుంటున్న నిర్ణయాలు రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారుతున్నాయి. అభివృద్ధి విషయంలో ఎలాంటి వివక్ష లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సమాన ప్రాధాన్యం కల్పిస్తున్నామని పాలకవర్గం స్పష్టం చేసింది. గ్రామంలో ఏ చిన్న సమస్య ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. గ్రామంలో విద్య,ఆరోగ్యం, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణ వంటి అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయనున్నట్లు పాలకవర్గం వెల్లడించింది. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టి లింగంపల్లి గ్రామాన్ని జిల్లాకే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేసింది.ప్రజల ఆశీర్వాదాలు, ప్రజల సహకారంతో లింగంపల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆదర్శ గ్రామంగా నిలబెట్టేందుకు నూతన పాలకవర్గం కట్టుబడి ఉందని సర్పంచ్ వడ్ల శోభా పరమేశ్వర్ మరియు వార్డు సభ్యులు సంయుక్తంగా ప్రకటించారు.



## వాగులో పడి వ్యక్తి మృతి



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వాగులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చిల్వర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అల్లాదుర్గం మండల పరిధిలోని చిల్వర్ గ్రామానికి చెందిన మ్యాదరి బేతయ్య ( 56)గత కొన్నాళ్లుగా ఒంటరిగా జీవిస్తున్నాడు,తన భార్య కొన్ని సంవత్సరాల క్రితం చనిపోవడంతో మద్యానికి బానిసై అటు ఇటు తిరిగేవాడిని తెలిపారు. గత మూడు రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదని తన కూతురు బాబాయ్ కి తెలుపగా ఎక్కడ తాగి పడుకున్నాడని భావించారన్నారు.ఆదివారం గ్రామ సమీపంలోని హుస్సేన్ వాగులో శవమై తేలడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ శంకర్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని వాగు నుండి శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కూతురు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

## మద్యం మత్తు విషాదం.. రైలు ఢీకొని వ్యక్తి మృతి

**ఎన్కేపల్లి గ్రామంలో విషాద ఘటన.. కుటుంబంలో తీవ్ర విషాదం**



**మోమిన్‌పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మోమిన్‌పేట్ మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామ శివారులో రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఎన్కేపల్లి గ్రామానికి చెందిన దాసరి రాజు (40), తండ్రి చంద్రయ్య, కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అతనికి భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు.శనివారం రాత్రి మద్యం మత్తులో భార్యతో గొడవపడిన రాజు ఇంటి నుంచి బైక్‌పై వెళ్లిపోయి తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు, బంధువులు చుట్టుపక్కల వెతుకుతుండగా గ్రామ శివారులోని రైల్వే పట్టాలపై అతని మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఈ ఘటనతో ఎన్కేపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య, ఇద్దరు చిన్నారులు దిక్కుతోచని స్థితిలో ఉండగా, కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జొన్నల కొనుగోలు ప్రక్రియలో జాప్యం...!

- అధికారుల ఆలసత్వం
- కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అల్లాదుర్గం మండలంలోని చిల్వర్ గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు ప్రక్రియలో అధికారులు జాప్యం వహిస్తున్నారని రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల నుండి జొన్నలను వెనువెంటనే కొనుగోలు చేయకపోవడంతో రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. రైతు ఆరుగాలం పంట ను పండించేందుకు పలు రకాలుగా ప్రయత్నించిన, తరువాత చేతికి వచ్చిన పంటను ప్రభుత్వానికి అమ్ముకుందామంటే అధికారులు రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ముప్పారం గ్రామానికి చెందిన రైతులు సొసైటీ అధికారులను నిలదీశారు. వర్షానికి జొన్నలు తడిసిపోతాయేమో అనే భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుని, జొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తీవ్ర ఆందోళన చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు డిమాండ్ చేశారు.



# చర్చి స్థలంపై ప్రభుత్వ కార్యాలయం కుట్ర?






- దళితుల ఆగ్రహం..నీళ్లు లేక ప్రజల విలవిల
- చర్చి పక్కన కార్యాలయ నిర్మాణం నిలిపివేయాలి
- పెత్తందారుల అరాచకాలపై చర్యలు తీసుకోవాలి
- రాళ్ల గుడుపల్లి గ్రామస్తుల డిమాండ్

**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రాళ్లగుడు పల్లి గ్రామంలో దళితుల చర్చి పక్కన ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటు చేయాలనే ప్రయత్నాలపై గ్రామ దళితులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 40 ఏళ్ల క్రితం అప్పటి సర్పంచ్ ర్యాగ శివయ్య గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలోని చెత్త కుప్పలను తొలగించి, దళితులు ప్రార్థనలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు చర్చి నిర్మాణం కోసం ఈ స్థలాన్ని కేటాయించారని గ్రామస్తులు తెలిపారు. చర్చి పక్కనున్న ఖాళీ ప్రదేశాన్ని గ్రామంలోని దళిత కుటుంబాలు పెళ్లిళ్లు, శుభకార్యాలు, సామాజిక సమావేశాలకు ఉపయోగిస్తున్నప్పటికీ, ప్రస్తుతం అదే స్థలంలో ప్రభుత్వ కార్యాలయం నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. గ్రామ సర్పంచ్ మహిపాల్ తో పాటు కొందరు పెత్తందారులు కుమ్మక్కై చర్చి స్థలాన్ని కబ్జా చేసేందుకు కుట్ర పన్నుతున్నారని దళితులు మండిపడ్డారు.ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి గ్రామంలో ఇతర ఖాళీ స్థలాలు అందుబాటులో ఉన్నాయని, చర్చి ప్రాంగణాన్ని లక్ష్యంగా చేసుకోవడం వెనుక దురుద్దేశం ఉందని వారు విమర్శించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు సృష్టించే వారిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకొని దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఇదిలా ఉండగా, గత వారం రోజులుగా గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు, గృహ అవసరాలకు కూడా నీరు అందక ప్రజలు అల్లాడిపోతున్నారని తెలిపారు.చర్చి పక్కన ప్రభుత్వ కార్యాలయం నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయడంతో పాటు, గ్రామంలో మిషన్ భగీరథ నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు ఉన్నతాధికారులను కోరారు. ప్రజల ఆవేదనను పరిగణనలోకి తీసుకొని అధికారులు జోక్యం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



# ప్రపంచంలోనే అతిపెద్ద జెంబే డ్రమ్ సర్కిల్‌తో గిన్నిస్ వరల్డ్ రికార్డ్

- హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన "రిథమ్"

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం శనివారం లయ, సంగీతం మరియు ఐక్యతకు ప్రతీకగా మారింది. "రిథమ్ - వరల్డ్'స్ లార్జెస్ట్ జెంబే డ్రమ్ సర్కిల్" పేరిట నిర్వహించిన ప్రతిష్టాత్మక కార్యక్రమంలో 2,000 మంది డ్రమర్లు ఒకే వేదికపై, ఒకే లయలో జెంబే డ్రమ్స్ వాయిస్తూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రయత్నంలో పాల్గొన్నారు. ది జెంబే సర్కిల్ వ్యవస్థాపకుడు మరియు సీఈఓ సాయి కుమార్ యేలేశ్వరపు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం వేలాది మంది ప్రేక్షకులను ఆకట్టుకుంది. సంగీతం ద్వారా సమాజంలో ఐక్యత, సానుకూలత మరియు సామాజిక చైతన్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, గాయకుడు& సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, నిర్వాహకులను అభినందించారు. ప్రపంచ రికార్డు సాధన లక్ష్యంతో పాటు, ఈ కార్యక్రమం "సే నో టు డ్రగ్స్" అనే సామాజిక సందేశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సృజనాత్మకత మరియు కళల వైపు అడుగులు వేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాయి కుమార్ యేలేశ్వరపు మాట్లాడుతూ, "లయ అనేది మనుషులను కలిపే సార్వత్రిక భాష. ఈ కార్యక్రమం ద్వారా సంగీత శక్తిని ప్రపంచానికి చాటడంతో పాటు, సమాజానికి సానుకూల సందేశాన్ని అందించగలిగినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ మా కృతజ్ఞతలు" అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో నిర్వహించిన ఈ భారీ కార్యక్రమం హైదరాబాద్‌కు మరో ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది. వేలాది డ్రమ్స్ ఒకే లయలో మార్మోగిన ఈ వేడుక పాల్గొన్న ప్రతి ఒక్కరికీ చిరస్మరణీయ అనుభూతిని మిగిల్చింది.

**కార్యక్రమ వివరాలు**

**కార్యక్రమం:** రిథమ్ - వరల్డ్'స్ లార్జెస్ట్ జెంబే డ్రమ్ సర్కిల్

**తేదీ:** జూన్ 20, 2026



**వేదిక:** గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం, హైదరాబాద్

**నిర్వాహకులు:** ది జెంబే సర్కిల్

**వ్యవస్థాపకుడు & సీఈఓ:** సాయి కుమార్ యేలేశ్వరపు

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**యోగాతో శరీరక, మానసిక ప్రశాంతత**



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీ.హెచ్.ఎస్) ముస్లాపూర్ లో యోగ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమంలో యోగ మాస్టర్ సంతోష్ కుమార్,యోగ ట్రైనర్ శ్రీమతి ఉజ్వల శ్రీభారతి లు మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం ద్వారా ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని అన్నారు. 30 నిమిషాలు యోగాకు సమయం కేటాయించడం ద్వారా వందేళ్లు ఆరోగ్యంగా జీవించే ఆస్కారం ఉందని పేర్కొన్నారు.మనిషి శరీరక మానసిక ప్రశాంతతకు యోగ తప్పనిసరి అవసరమని ఈ సందర్భంగా విద్యార్థులకు యోగ యొక్క ప్రత్యేకత, వివిధ ఆసనాలు చేసే విధానం,యోగ వల్ల కలిగే శారీరక మరియు మానసిక ప్రయోజనాలను వివరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్లాదుర్గం సబ్ ఇన్ స్పెక్టర్ శంకర్ మాట్లాడుతూ.. యోగ చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని, విద్యార్థులు ప్రతిరోజూ యోగ సాధన చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గాలయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.రమేష్,కరాటే మాస్టర్ మల్లేశం , జనార్ధన్,దేవానంద్, సంతోష్, గురుచరణం,శంషాద్దీన్,యాదయ్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల




**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అల్లాదుర్గం చేనేత సహకార సంఘం ఎన్నికలు ఈనెల 30న నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి రాజ్ కిరణ్ తెలిపారు. 22 నుంచి 24 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు దాఖలు చేయవచ్చు,25న పరిశీలన, 27న ఉపసంహరణ అనంతరం అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు తుది అభ్యర్థుల జాబితా ప్రకటించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రాములు,పెంటయ్య, తదితరు నాయకులు సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# పటాన్ చేరులో అంగరంగ వైభవంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

- హాజరైన వందలాది మంది విద్యార్థులు,వివిధ వర్గాల ప్రజలు, అధికారులు,మాజీ ప్రజా ప్రతినిధులు
- రెండు గంటల పాటు నిర్విరామంగా యోగా విన్యాసాలు
- యోగా విశిష్టతను తెలిపేలా యోగా భంగిమలు
- యోగా దినచర్యలో భాగం కావాలి
- ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా సువర్ణ అవకాశం
- పటాన్ చేరులో ఘనంగా అంతర్జాతీయ యోగా డే వేడుకలు
- ప్రొఫెసర్ జయశంకర్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం
- సమాజం నుండి డ్రగ్స్ ను వెలివేయాలి
- పటాన్ చేరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్ చెరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహించిన యోగా దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. వందలాది మందితో కలిసి సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 6:30 నుండి 09:00 గంటల వరకు పతాంజలి యోగ సమితి శిక్షకుల సౌజన్యంతో రెండున్నర గంటల పాటు వివిధ రకాల యోగా భంగిమలు ప్రదర్శిస్తూ.. ప్రతి ఒక్కరిని భాగస్వాములు అయ్యేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగ ప్రాముఖ్యతను తమ ఆసనాల ద్వారా వివరిస్తూ సంపూర్ణమైన ఆరోగ్య జీవనశైలికి యోగ ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. ఈ సందర్భంగా పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి తన ఆరోగ్యం పై దృష్టి పెట్టకపోవడం మూలంగా మానసిక, శారీరక సమస్యలతో నిరంతరం బాధపడుతూ అనారోగ్యకరమైన జీవితాలను కొనసాగిస్తున్నారని తెలిపారు.ఈ నేపథ్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గంలోని ప్రజలకు యోగ ప్రాముఖ్యతను తెలియజేయాలన్న సమున్నత లక్ష్యంతో.. గత రెండు సంవత్సరాల నుండి మైత్రి మైదానంలో యోగ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.మనిషి నిత్యం ఎదుర్కొనే మానసిక,ఆరోగ్య సమస్యలకు సర్వరోగ నివారిని యోగ అని అన్నారు. యోగాకు కులం మతం ప్రాంతం జాతి లేదని, ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగమని తెలిపారు. యావత్తు ప్రపంచానికి భారతదేశం అందించిన మహోన్నత సాధనం యోగ అని అన్నారు.విద్యార్థి దశ నుండే మత్తు పదార్థాల వినియోగం, వాటి దుష్ఫలితాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ కల్చర్ ఎక్కువగా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతి పౌరుడు తన బాధ్యతగా డ్రగ్స్ కి వ్యతిరేకంగా పోరాటం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

**తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్..**

తొలిమలి దశ తెలంగాణ పోరాటంలో కీలక పాత్ర పోషించడంతోపాటు.. ప్రత్యేక తెలంగాణ సాధనకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన యోగా దినోత్సవ వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఐశ్వర్య నృత్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన అందర్నీ అలరించింది.అనంతరం వివిధ క్రీడ అంశాల్లో రాష్ట్ర జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభగల పరిచిన క్రీడాకారులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమాల్లో పటాన్ చెరు సిఐ వినాయక్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్,మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్,వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పతంజలి యోగాసమితి రాష్ట్ర అధ్యక్షులు పస్పరి శివుడు, నర్సింలు, సంజీవ రెడ్డి,మురళి, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి,పరమేష్,తాజా మాజీ ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, యోగా సమితి సభ్యులు,ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు,క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.





## ఖుద్వాన్పూర్లో అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఖుద్వాన్పూర్ గ్రామ జడ్పి హెచ్ఎస్ పాఠశాలలో యోగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పలు విధములైన యోగాసనాలు వేసి యోగా డేను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..ఆరోగ్యకరమైన జీవనం కోసం యోగా ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు.ప్రతి ఒక్కరూ అనారోగ్యానికి లోను కాకుండా ఉండాలంటే యోగాసనాలు తప్పనిసరిగా చేయాలని అన్నారు.యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలు వాటి యొక్క వివరణ యోగా ట్రైనర్ పలువురికి విపులంగా వివరించారు.ఈ కార్యక్రమంలో ఖుద్వాన్పూర్ గ్రామ ఆయుర్వేద వైద్యశాల వైద్యురాలు,పాఠశాల హెచ్ఎం,ఉపాధ్యాయులు,గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డ్ సభ్యులు,గ్రామస్తులు,ఆశ కార్యకర్తలు,వైద్యశాల సిబ్బంది, పాఠశాల సిబ్బంది,ఆయుష్ యోగ శిక్షకులు పాల్గొన్నారు.

## అమ్మవారి కృప కరుణ కటాక్షాలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలి

**బిఆర్ఎస్ ఎల్పి విప్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఈరోజు 126 జగద్గిరిగుట్ట డివిజన్ సీసల బస్తిలోని శ్రీ వైష్ణవి దుర్గ దేవాలయంలో జై గురు నవదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన దేవాలయ వార్షికోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..శ్రీ వైష్ణవి దుర్గా అమ్మవార్ల కరుణా కటాక్షాలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్,డివిజన్ అధ్యక్షులు రుద్రా అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, జై గురు నవదుర్గ సేవాసమితి ట్రస్ట్ సభ్యులు శ్రీకాంతాచార్యులు,జైహింద్,రాఘవేందర్, కపిరాజు రంగనాథ్, కర్ణ, నాయకులు మల్లేష్ గౌడ్,పాపి రెడ్డి, విటల్ ముదిరాజ్, బ్రహ్మానంద చారి, దాసు,రమేష్,ప్రభాకర్, మెట్ల శీను,దాసు,విగ్నేష్,ముంతాజ్, సంతోష్,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ ను పరామర్శించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సికింద్రాబాద్ బోయినపల్లి లోని హెకా రిహబ్ సెంటర్ లో బ్రెయిన్ స్ట్రోక్ కు గురై చికిత్స తీసుకుంటున్న ఆందోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సీనియర్ పాత్రికేయులు కనకంటి భూమయ్యాను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి పై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. భూమయ్యకు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా వైద్యశాఖ అధికారిని మంత్రి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా టీయూడబ్ల్యూజే యూనియన్ అధ్యక్షులు శంకర్ దయాల్ చారి, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బహీరందిబ్బలో యోగా వేడుకలు



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అల్లాదుర్గ్ మండలం బహీరందిబ్బలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యోగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ వీరన్న మాట్లాడుతూ..యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని,అది సంపూర్ణ ఆరోగ్యానికి మార్గమని అన్నారు. నిత్యం యోగా చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. గ్రామస్తులు,యువకులు యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రభు, గ్రామస్తులు నాయకులు పాల్గొన్నారు.

## సీత్తనగర్ ఇందిరమ్మ గృహ ప్రవేశం



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సీతానగర్ గ్రామంలో అంజలి, భాగేష్ నిర్మించిన నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై గృహ ప్రవేశం చేశారు. నిరుపేద కుటుంబాలకు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల అందిస్తుందని, దీనిని ప్రతి లబ్ధిదారుడు. వినియోగించుకోవాలన్నారు .ఈ కార్యక్రమంలో సీతానగర్ గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుభాష్‌రావు, బలరాం, బాలకిషన్,జైపాల్, సంతోష్ తదితరులు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ప్రభుత్వం యూరియా యాప్ పేరున రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది

- డా.ఎం.ఏ.హకీమ్
- సీఎం రేవంత్ రెడ్డి పాలన మామూలు పాలనకాదది ఐరన్ లెగ్ పాలన.
- తేల్ల రవికుమార్
- సంక్షేమం నుండి సంక్షోభం దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగుతోంది
- సాయినాథ్
- రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విస్మరించింది
- సూదం నవీన్
- యాప్ ను వెంటనే రద్దుచేయాలని ఉమ్మడి మండలాల బీఆర్ఎస్ నేతల ప్రెస్ మీట్
- ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతికి పలువురు ఘన నివాళులు



కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా యాప్ పేరున తెలంగాణ రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని పోతంగల్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు డాక్టర్ ఎం ఏ హకీమ్ మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి పాలన మామూలు పాలన కాదది ఐరన్ లెగ్ పాలన అని కోటగిరి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు తేల్ల రవికుమార్ పేర్కొన్నారు.రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందనీ బీఆర్ఎస్ పార్టీ నాయకులు సూదం నవీన్ అన్నారు. రైతు సంక్షేమ పాలన నుంచి రైతు సంక్షోభం పాలన దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకెళ్లిందని పోతంగల్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు సాయినాథ్ పేర్కొన్నారు.ఆదివారం కోటగిరి పోతంగల్ మండల కేంద్రాలలో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రంలో రైతన్నలు ఎదుర్కొంటున్న యూరియా యాప్ కు వ్యతిరేకంగా ప్రెస్ మీట్ నిర్వహించారు. అంతకుముందు ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ. తొలి దశ మలిదశ ఉద్యమంలో వీరోచిత ఉద్యమాలు పోరాటాలు చేసి రాష్ట్ర సాధనలో తన జీవితాన్ని ధార పోసిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. నేటి యువతరం జయశంకర్ సార్ ఆశయాలు,ఆకాంక్షల కు అనుగుణంగా నడుచుకోవాలని పిలుపునిచ్చారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కటంటే ఒక్కటి అమలు చేయలేదని.సీఎం రేవంత్ రెడ్డి పాలన ఐరన్ లెగ్ పాలన అనీ హెగ్దేవ చేశారు. తెలంగాణ రాష్ట్ర మినహాయించి మిగతా కాంగ్రెస్,బిజెపి పాలిత రాష్ట్రాలలో ఈ యూరియా యాప్ కొనసాగుతుందా అని ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మెడలు వంచుతుందని.ఇక్కడి ప్రభుత్వం కేంద్రానికి బీ టీంగా పని చేస్తుందా అనీ ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్ష పాతి అయితే వెంటనే యూరియా బుకింగ్ యాప్ ను తొలగించాలని అన్నారు.కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం నిరసన కార్యక్రమాలు చేపట్టాలని అందుకు బీఆర్ఎస్ పార్టీ తమకు మద్దతుగా నిలిస్తుందని పేర్కొన్నారు.ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ యాప్ ను తొలగించి యధావిధిగా రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో రానున్న రోజుల్లో అంచలంచలుగా ఉద్యమాలు, నిరసనలతో ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ ప్రెస్ మీట్లో మాజీ ఎంపీపీ మోరే సులోచన కిషన్,పిఏసిఎస్ కోటగిరి వైస్ చైర్మన్ బొట్టే గజేందర్,వార్డు సభ్యులు సాజిదా బేగం నజీర్,గగన్, అంబటి సౌజన్య గంగాప్రసాద్,మాజీ మార్కెట్ డైరెక్టర్ కప్ప సంతోష్, సీనియర్ నాయకులు సమీర్,శంకర్ గౌడ్,గంగాధర్,గణేష్,కన్నం సాయిలు, పాల గంగారం,హాస్టల్ గంగారం,ఏజాజ్ , ఏకార్,హనుమంతు,ఇమ్రాన్,అనిల్,సందీప్,యోగి,తదితరులు పాల్గొన్నారు.



Printed, Published, Edited & Owned by Rathod Vinod Kumar, Printed At Falcon Printing Press, SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: Rathod Vinod kumar, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com